

స్వల్పంగా పెరుగుతూ...

భద్రాచలంలో గోదావరి నీటిమట్టం తగ్గినట్లే తగ్గి సాయంత్రం నుంచి మళ్లీ స్వల్పంగా పెరుగుతూ 41 అడుగులకు చేరింది. 8లో



నిరంతర పోరాటాలు

ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. 10లో



వాతావరణం

ఆదివారం జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. జిల్లా అంతటా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం గర్భగుడిలో సుప్రభాత సేవ నిర్వహించిన అర్చకులు.. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదం, విగ్రహానికి పంచామృతంతో అభిషేకాలు జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రపత్యేకంగా అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన అర్చకులు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

దివ్యాంగ వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం రోటరీనగర్‌లోని దివ్యాంగ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జి.జ్యోతి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3నుంచి 10వ తరగతి చదువుతున్న శారీరక దివ్యాంగ బాలురు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. వసతిగృహంలో భోజన సౌకర్యంతో పాటు వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు వచ్చేనెల 31లోగా తమ కార్యాలయంలో కానీ వసతి గృహంలో కానీ దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 95028 75146 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ సాహిత్యంలో దాశరథి సేవలు అజరామరం



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: నా తెలంగాణ కోటి రతనాల వీణ.. అని సగర్వంగా ప్రకటించి ప్రజలను జాగృతం చేసిన కవితా యోధుడు దాశరథి కృష్ణమాచార్య సేవలు మరవలేనివని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అన్నారు. దాశరథి జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య రంగంలో దాశరథి సేవలు అజరామరమని, నాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా కవితల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వెల్పుల అర్జున్, ఉద్యోగులు భాస్కర్, కనకవల్లి, విజయ్‌కుమార్, అఖిల్, నాగన్న, లలిత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హరితహారానికి ఇదే మంచి తరుణం



రేగులచలక రోడ్డులో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్డీఓ

రఘునాథపాలెం: విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన హరితహారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటడంపై దృష్టిసారించాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. రఘునాథపాలెం మండలంలోని రేగులచలక, కోటపాడు, చిమ్మపుడి పంచాయతీల్లో శనివారం పర్యటించిన ఆమె రహదారుల వెంట ప్రకృతివనాలు, వైకుంఠధామాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. అలాగే, ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ పద్మయ్యనాయుడు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

26వరకు 'దోస్త్' కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: 'దోస్త్' సైట్ ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మూడో దశల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో సూచించారు. అలాగే, మూడో విడతలో సీట్లు పొందిన వారికి సెల్ఫ్ రిపోర్టింగ్ ఈనెల 26వ తేదీ వరకు ఉందని తెలిపారు.



హంగులతో ఆహ్వానం!

సిద్ధమవుతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ

- చివరి దశకు చేరిన పనులు
- రెండు నెలల్లో మొదలుకానున్న తరగతులు
- ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పలువురు ర్యాంకర్లు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కల మరికొద్ది రోజుల్లో నెరవేరనుంది. వైద్య విద్యార్థులకు బోధన త్వరలో ప్రారంభం కానుండగా.. అన్ని హంగులతో భవనాలు సిద్ధమయ్యాయి. ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు గత ఏడాది మెడికల్ కళాశాలను మంజూరు చేసిన విషయం విదితమే. ఈ మేరకు రూ.166 కోట్లు కేటాయించగా... పలుమార్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి అనుమతులు జారీ చేశారు. అవసరానికి మించిన స్థలం.. అదీ నగర నడిబొడ్డున ఉండటంతో త్వరగా అనుమతులు లభించాయి. దీంతో వంద సీట్లతో ఈ ఏడాది నుండే కళాశాలలో తరగతులు ప్రారంభించే అవకాశం దక్కింది.

ముందుగానే ఉద్యోగుల నియామకం

ఉన్నతాధికారులు మెడికల్ కళాశాలకు ఈ ఏడాది మొదటి నుంచే వైద్యులు, సిబ్బందిని కేటాయించడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఆరుగు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 23మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 27మంది సీనియర్ రెసిడెంట్లు, ఐదుగురు హౌస్ సర్జన్లు, 15మంది డీఆర్‌పీలను కేటాయించారు. మరో 60 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు త్వరలోనే రానున్నారు.

ఇటు వైపే ర్యాంకర్ల మొగ్గు

ఈ ఏడాదికి గాను నీట్ ద్వారా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తొలివిడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. దీంతో చాలామంది మెరిట్ ర్యాంక్ విద్యార్థులు ఖమ్మం మెడికల్ కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకున్నట్లు తెలిసింది. అంతేకాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాల భవనాలను చూసేందుకు వచ్చివెళ్తున్నారు. నగరం మధ్యలో, అన్ని వసతులతో ఉండడంతో భవనాలు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ కళాశాలలో చేరాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనుండగా, రెండు నెలల్లో తరగతులు మొదలవుతాయి.

చకచకా ఆధునికీకరణ పనులు

మెడికల్ కాలేజీకి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ, డీఎంహెచ్ఓ కార్యాలయాలు కేటాయించగా దాదాపు 30 ఎకరాల స్థలం అందుబాటులోకి వచ్చినట్లయింది. ఆ వెంటనే ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం రూ.9 కోట్లు కేటాయించటంతో చేపట్టిన పనులు చివరి దశకు చేరాయి. పాత కలెక్టరేట్ వెనుక భాగంలోని సివిల్ సప్లయీస్, ఈవీఎం గోదాం భవనాల్లో పనులు పూర్తికాగా, వీటిని అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, లెక్చరర్ హాళ్ల స్టాఫ్ రూమ్స్‌కు కేటాయించారు. అలాగే పాత కలెక్టరేట్ భవనంలో అడ్మిన్ బ్లాక్, ఆడిటోరియం, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, సోషల్ ప్రివెంటీవ్ మెడిసిన్, విద్యార్థులకు క్యాంటీన్ సిద్ధం చేశారు. ఇక పాత డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని బాలుర వసతిగృహానికి, ఆర్అండ్‌బీ భవనాన్ని బాలికల వసతిగృహంగా వినియోగించనున్నారు.

పనులన్నీ పూర్తి కావొచ్చాయి..



మెడికల్ కళాశాలలో బోధనకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు నెలల్లో తరగతులు ప్రారంభం కానుండగా, ఆధునికీకరణ పనులన్నీ దాదాపు పూర్తికావొచ్చాయి. ఇప్పటికే వచ్చిన బోధన, బోధనేతర సిబ్బందికి తోడు మరికొందరిని త్వరలో కేటాయించనున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో పలువురు విద్యార్థులు ఖమ్మం కళాశాలను ఎంచుకుంటున్నారు.

– ఎస్.రాజేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

కోహెడ మార్కెట్‌కు జిల్లా నిధులు!

ఉమ్మడి జిల్లా మార్కెట్ల నుంచి అప్పుగా రూ.66 కోట్లు

నేలకొండపల్లి: గడ్డి అన్నారం పరిధిలోని కోహెడ మార్కెట్ నిర్మాణానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల నుంచి నిధులను అప్పుగా పంపించాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని మార్కెట్ల అధికారులు కసరత్తు ప్రారంభించారు. కోహెడలో రూ.350 కోట్లతో నిర్మిస్తున్న పండ్ల మార్కెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ల నుంచి నిధులు సమీకరిస్తున్నారు. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాలోని మద్దులపల్లి మార్కెట్ మినహా మిగిలిన ఏడు మార్కెట్ల నుంచి రూ.48 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట, ఇల్లెందు, బూర్గంపాడు, చర్ల వ్యవసాయ మార్కెట్ల రూ.18 కోట్లు కలిపి రూ.66 కోట్లను కోహెడ్ మార్కెట్ నిర్మాణానికి పంపించాలంటూ ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే పలు కమిటీల నుంచి చెక్కులు పంపించినట్లు సమాచారం. కాగా, జిల్లాలోని మార్కెట్లలో అభివృద్ధి చేయాల్సింది పోయి అప్పు పేరుతో నిధులను మళ్లించడంపై రైతులు, రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ నిధులు తిరిగి రాకపోతే ఎలా సందిగ్ధత నెలకొంది. ఈ విషయమై భద్రాద్రి జిల్లా మార్కెటింగ్ అధికారి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ అధికారి అలీంను వివరణ కోరగా ఉమ్మడి జిల్లాలోని 11 వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి కోహెడ మార్కెట్‌కు అప్పుగా రూ.66 కోట్లు పంపించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.

రహదారి విస్తరణకు రూ.7.73కోట్లు

ఖమ్మంరూరల్: ఖమ్మం – సూర్యాపేట నాలుగు లేన్ల రహదారి విస్తరణలో భాగంగా గతంలో పొన్నేకల్ వరకు నిర్మాణం పూర్తయింది. ఆతర్వాత పనులు నిలిచిపోగా, ఇప్పుడు పొన్నేకల్ నుండి మద్దులపల్లి వరకు రహదారి విస్తరణకు రూ.7.73కోట్లు మంజూరయ్యాయి. కేంద్ర మంత్రి గడ్కరీకి గతంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ సమస్యను వివరించారు. అలాగే, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా ఈ విషయమై గడ్కరీకి ఢిల్లీలో వినతిపత్రాలు అందజేశారు. ఈమేరకు నిధులు మంజూరు చేస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పొన్నేకల్ – మద్దులపల్లి మార్గంలో రోడ్డు విస్తరణతో పాటు, ఇంటర్‌వెన్షన్స్, బాక్స్ కల్వర్ట్, సెంట్రల్ లైటింగ్ తదితర పనులు చేపట్టనున్నారు. కాగా, నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి అజయ్‌కుమార్, ఎంపీ రవిచంద్రకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

మణిపూర్ ఘటనపై ప్రధాని మౌనం వీడాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ పాలిత మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ నోరు విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ ఘటన దేశాన్ని కలిచివేసినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండడంతో మహిళలపై బీజేపీ వైఖరి అర్థమవుతోందన్నారు. బీజేపీ పాలిత ప్రాంతమైన మణిపూర్‌లో మహిళలకు రక్షణ లేదని ఈ సంఘటనతో తేటతెల్లమైందన్నారు. ఘటన జరిగి 75 రోజులు గడుస్తున్నా, ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నా సంబంధం లేనట్టుగా దేశ ప్రధాని వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నినాదమైన భేటీ పడావో, బేటి బచావో అనేది మాటలకే పరిమితమైనట్లుగా ఈ ఘటనతో తేలిపోయిందని చెప్పారు. కాగా, ప్రధాని మోదీకి మణిపూర్ సందర్శించడానికి సమయం లేకున్నా, విదేశీ పర్యటనలకు సమయం లభిస్తోందని ఎద్దేవా చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.సుదర్శన్ మాట్లాడుతూ ఈనెల 25న ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావంగా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్, మాచర్ల భారతితో పాటు బుగ్గవీటి సరళ, బండి రమేష్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, వై విక్రం, సీహెచ్.కోటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా స్థలాల క్రమబద్ధీకరణ

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి జీఓలు 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణ ప్రక్రియను మరింత వేగంగా చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు రుసుము చెల్లించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

అధికారులకు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల యంత్రాల నిర్వహణపై అవగాహన అవసరమని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఉద్యోగులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడగా మాస్టర్ ట్రెయినర్లు శిక్షణ ఇచ్చారు. అలాగే, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాలను ఖమ్మం పాత బస్టాండ్ వద్ద కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడడంతో పాటు ఈవీఎంలపై అపోహలు తొలగిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఎస్‌డీసీ దశరథం, తహసీల్దార్లు శైలజ, సుమ, కలెక్టరేట్ ఎన్నికల డీటీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పది వేల మందికి లైసెన్స్ ఇప్పిస్తాం..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఆర్‌టీఓ కిషన్‌రావు, విజయ్, గుండాల కృష్ణ తదితరులు

- ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దనే ప్రత్యేక మేళా
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మహిళకు లైసెన్స్ అందజేస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గంలోని అర్హులైన యువతీ, యువకులందరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. పది వేల మందికి లైసెన్స్ లేదని అంచనా వేయగా, వారికి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఫీజు చెల్లించి లైసెన్స్‌లు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మంలోని వీడీవోస్ కాలనీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలువురికి లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేసి మాట్లాడారు. ఖమ్మంలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని గుర్తించి ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత పలు జిల్లాల్లో ప్రజాప్రతినిధులు ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఈ మహత్తర కార్యక్రమం చేపట్టినట్లు పువ్వాడ తెలిపారు.

ఇప్పటికే 2వేల మందికి

పలువురు యువత వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలుసుకుని అందరికీ లైసెన్స్ ఇప్పించేందుకు ముందుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. కొందరు కార్యాలయానికి వెళ్లలేక, వేచి ఉండలేక లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తామే ప్రత్యేక మేళా ద్వారా ఫీజు చెల్లించి లైసెన్స్‌లు ఇప్పిస్తున్నామని చెప్పారు. ఈ మేళా ద్వారా పదిహేను రోజుల్లోనే దాదాపు రెండు వేల మందికి లైసెన్స్‌లు ఇప్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్‌టీఓ కిషన్ రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, ఎంవీఐ వరప్రసాద్, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, నాయకులు గుండాల కృష్ణ, కన్నం ప్రసన్నకృష్ణ, పిన్ని కోటేశ్వరరావు, రావూరి సైదుబాబు, తన్నీరు శోభారాణి, సైదారావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ

దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,106 చేర్చడం ద్వారా సంక్షేమ పథకాల అమలులో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నట్లు మరోమారు నిరూపితమైనందని మంత్రి పువ్వాడ తెలిపారు. ఇటీవల చేసిన ప్రకటన మేరకు సీఎం కేసీఆర్ దివ్యాంగుల పింఛన్ రూ.3,016 ఉండగా రూ.వెయ్యి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. తద్వారా వారికి మరింత భరోసా కలగనుందని తెలిపారు.

టికెట్ ఎవరికి వచ్చినా పార్టీదే విజయం



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ శ్రీనివాసరెడ్డి, పక్కన మాజీ మంత్రి సంభాని, నాయకులు

- అందరం ఒకే వేదిక మీదకు వస్తున్నాం..
- కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే అంతిమ లక్ష్యం
- టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అందరం ఒకే వేదిక మీదకు వస్తున్నాం.. కాంగ్రెస్ నుంచి ఎవరికి బీ ఫాం ఇచ్చినా హస్తం గుర్తువిజయమే లక్ష్యంగా కృషి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీపీసీసీ కోచైర్మన్‌గా, ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎన్నికైన నేపథ్యాన ఘనంగా సత్కరించారు. తొలుత పట్టణంలో భారీగా మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ రాహుల్ గాంధీ హాజరైన ఖమ్మం సభను అడ్డుకునేందుకు ఎన్నో అడ్డంకులు సృష్టించినా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్తా చాటారన్నారు. కల్వకుంట్ల కుటుంబం రూ.లక్షల కోట్లు దోచుకుంటూ, ప్రధానమంత్రి ఎన్నికల్లో ఖర్చు భరించే స్థాయికి చేరారని మండిపడ్డారు. ఆ పార్టీకి ధైర్యం ఉంటే సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ బీఫాంలు ఇవ్వాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని మాట్లాడుతున్న వారు.. రాష్ట్రంలో 25వేల చెరువులను తవ్వించింది.. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, పులిచింతల, ఎస్ఎల్‌బీసీ, ప్రకాశం బ్యారేజ్ నిర్మించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తించాలని సూచించారు. కానీ బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ పేరిట కాల్వల్లో పిచ్చిమొక్కలు తొలగించి గొప్పలు చెప్పుకుంటున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే.. దొరను మించిన దొర

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎం కేసీఆర్ దొరను మించిన దొర అని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌లో గ్రూపులు ఉన్నాయి.. ఏదో ఒక గ్రూప్ సహకారంతో గెలవొచ్చని పగటి కలలు కంటున్న ఆయన ప్రజా తీర్పుకు తలవంచాల్సిందేనన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరకముందు జెండా, అజెండా ఏమిటని సండ్ర ప్రశ్నించారని... కానీ ఇప్పుడు మూడు రంగుల జెండా పట్టుకోవడంతో ఆయనకు నిద్ర పట్టడం లేదని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రం, దేశంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలను చిత్తుచిత్తుగా ఓడించేలా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు. దుర్మార్గమైన పరిపాలనను అంతమొందించేందుకు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి కలిశారని..

ఇక కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని చెప్పారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు ఎస్.కే.మౌలాలీ, మండపాటి పద్మజ్యోతిరెడ్డి, దూదిపాల రాంబాబు, మాజీ కౌన్సిలర్ బాబురావు, మండపాటి రవీందర్‌రెడ్డి తదితరులు పొంగులేటి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ సభ్యులు, నాయకులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, రామిశెట్టి మనోహర్‌నాయుడు, వక్కలగడ్డ చంద్రశేఖర్ కొండూరు కిరణ్, మండపాటి ముత్తారెడ్డి, ఉడతనేని అప్పారావు, కొత్రపాటి సాల్మన్‌రాజు, శివవేణు, ఒంటెద్దు సాయిలు, కాపా సుధాకర్, దుర్గాప్రసాద్, చెలికాని రాజబాబు, రావి నాగేశ్వరరావు, గోళ్ల అప్పారావు, రామిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వానలు..

ఈనెల సాధారణానికి మించి వర్షపాతం

ఖమ్మంవ్యవసాయం: గతనెలలో లోటు వర్షపాతం నమోదు కాగా.. ఈనెల మాత్రం సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతోంది. ఈనెల సాధారణ వర్షపాతం 272 మి.మీలు. కాగా శనివారం నాటికి 177.1 మి.మీల నమోదు కావాల్సి ఉంది. కానీ 198.9 మి.మీల వర్షపాతం నమోదు కావ డం విశేషం. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా వారం రోజులుగా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఎగువన కురిసిన వర్షాలతో జిల్లాలోని జలాశయాలకు వరద చేరుతుండగా జలకళ సంతరించుకుంది. గత నెల వర్షాలు ఆశాజనకంగా లేకపోవటంతో పత్తి, అపరాల పంటల సాగు తగ్గింది. పత్తి 2.23 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 1.31 లక్షల ఎకరాల్లోనే వేశారు. అలాగే, అపరాల పంటలైన పత్తి, కంది సాగు కూడా తగ్గింది.

పంటలపై ఆశలు

ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో పంటలపై ఆశలు చిగురించాయి. దీంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే లక్ష ఎకరాలకు వరి నార్లు పోయగా, మరో 1.50 లక్షల ఎకరాల్లో నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండటంతో మొత్తంగా 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే, మిర్చికి మంచి ధర ఉన్న నేపథ్యాన జిల్లా రైతులు 80 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశముందని భావిస్తున్నారు.

రేపు మరో అల్పపీడనం

మరో అల్పపీడనం సోమవారం వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఈ కారణంగా నాలుగు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

రావినూతలో 31 మి.మీల వర్షపాతం

శనివారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలోని బోనకల్ మండలం రావినూతలలో అత్యధికంగా 31 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, మధిర మండలం సిరిపురంలో 28.3 మి.మీ.లు., ముదిగొండ మండలం బాణాపురంలో 21, నేలకొండపల్లిలో 15.3, ఖమ్మం అర్బన్ ఖానాపురంలో 14.5, మధిరలో 13.5 మి.మీ. వర్షపాతం నమోదు కాగా మిగిలిన ప్రాంతాల్లో 10 మి.మీల లోపే వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మండలం కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయానికి టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆయన కమిటీ ప్రతినిధులకు శనివారం నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజినితో పాటు కాసాని సత్యనారాయణ, కాసాని లింగయ్య, బోయినపల్లి శ్రీను, మేకపోతుల సురేష్, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లపై మొండివైఖరి విడనాడాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని పలువురు సూచించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్‌భవన్‌లో శనివారం ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ మహిళా కార్యదర్శి రాయల లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గన్నవరపు ఉపేందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గెస్ట్ లెక్చరర్లను కాదని కొత్త వారిని నియమించాలనుకోవడం సరికాదన్నారు. పాత వారిని రెన్యూవల్ చేయకపోవడంతో బోధన కుంటుపడినందున వెంటనే వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.విజయలక్ష్మి, రామకృష్ణ, చింతల రమేశ్, తుడుం ప్రవీణ్, యాకుబ్‌పాషా, కోలా లక్ష్మీనారాయణ, మస్తాన్, చందు, లక్ష్మణ్, మద్దోజు శ్రవణ్‌కుమార్, యువరాజు, మధు, శివనాయక్, చందూలాల్, ఉపేందర్, రమేశ్, శ్రీను, వీరేందర్, ఉమాశంకర్, జస్వంత్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు పెద్దపీట



మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో మహిళా ఉద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ తెలిపారు. నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో జరిగిన టీఎన్జీవోస్ మహిళా విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా మహిళా విభాగం లేకున్నా ఖమ్మంలో ఏర్పాటు చేశామని తెలిపారు. యూనియన్‌లో రెండేళ్లుగా మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాబాసు జ్యోతి, స్వప్నతోపాటు నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాద్‌రావు, నీరుకొండ చంద్రశేఖర్, మజీద్, నాగుల్‌మీరా, శిరణ్మయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఈఈ



పాలేరు నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఈఈ

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను శనివారం జలవనరులశాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఇప్పటికే సాగర్ జలాలు చేరగా, తాజాగా వర్షాలతో వస్తున్న వరద ప్రవాహంపై స్థానిక అధికారులతో ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 20 అడుగులకు మించినీరు ఉండడం, ఇంకా ప్రవాహం వస్తుండడంతో పాలేరు కాల్వ లేదంటే ఎడమ కాల్వకు నీరు విడుదల చేసే అంశాన్ని పరిశీలించారు. వరిసాగు మొదలవుతున్న నేపథ్యాన రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతామని ఈఈ తెలిపారు.

లారీ ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని బైపాస్ రోడ్డులో లారీ ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం రాత్రి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న గొల్లగూడెంకు చెందిన యువకులు మధు, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరికి జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

స్వల్పంగా పెరుగుతూ..

41 అడుగులు దాటిన గోదావరి

- 8 గంటల పాటు 39 అడుగుల వద్దనే ప్రవాహం
- పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- బూర్గంపాడులో మంత్రి పువ్వాడ సమీక్ష





భద్రాచలం వద్ద నిలకడగా ప్రవహిస్తున్న గోదావరి (ఇన్‌సెట్) బ్రిడ్జి పై నుంచి గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీ మాలోత్ కవిత, విప్ రేగా కాంతారావులు

భద్రాచలం/బూర్గంపాడు : భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 39.04 అడుగుల వద్దనే నిలిచిన నీటిమట్టం.. సాయంత్రం 5 గంటలకు కొద్దిగా పెరిగి 39.09 అడుగులుగా నమోదయింది. అయితే శుక్రవారం ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నుంచి గోదావరిలోకి వరద నీరు వదలడంతో శనివారం రాత్రి 10 గంటలకు 41.07 అడుగులకు చేరింది. ఇది మరికొంత పెరిగే అవకాశం ఉందని నీటి జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా విస్తా కాంప్లెక్స్, కొత్త కాలనీల వద్ద నున్న స్లూయిజ్‌లను ఆర్‌డీవో రత్నకళ్యాణి పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన ఎంపీ, విప్..

గోదావరి వరద పరిస్థితిని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరదల పట్ల ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి వరదలతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని, అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ కవిత, అధికారులు

గోదావరి వరదల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో శనివారం మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలన్నారు. ముంపు గ్రామాల్లో పనిచేసే అధికారులంతా అందుబాటులో ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టి బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో భోజనం, అల్పాహారం, పాలు అందించాలన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని అన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లోనే ఉండి ప్రజలకు సత్వర వైద్యసేవలు అందించాలన్నారు. ముంపు ప్రాంతాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలెవరూ నీళ్లలోకి దిగకుండా చర్యలు చేపట్టాలని న్నారు. అన్ని శాఖలను అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. సమీక్షలో వరదల పర్యవేక్షణ ప్రత్యేకాధికారులు దురిశెట్టి అనుదీప్, గౌతమ్ పాట్రు, కృష్ణ ఆదిత్య, కలెక్టర్ ప్రియాంక, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బూర్గంపాడు, భద్రాచలంలో గోదావరి వరదల పరిస్థితిని ఎంపీ మాలోత్ కవిత, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం పరిశీలించారు. ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తక్షణమే తమకు తెలియజేయాలని సూచించారు.

బదిలీ అధికారులకు ఘన సన్మానం



సన్మాన సభలో కలెక్టర్ గౌతమ్, అధికారులు, యూనియన్ నాయకులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న రెవెన్యూ అధికారులను శనివారం రాత్రి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యాన సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ బదిలీ అయి వెళ్తున్న అధికారులు జిల్లాలో ప్రభుత్వపథకాల అమలుకు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఆర్వో శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దశరథ్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణను సన్మానించారు. ట్రెసా నాయకులు కారుమంచి శ్రీనివాసరావు, తుంబూరు సునీల్‌రెడ్డి, దొడ్డా పుల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న అవినాష్‌కుమార్

ముదిగొండ: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకుని మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు మండలంలోని బాణాపురంలో ఆవుల అమ్మిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో అవినాష్‌తో పాటుగా రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి ఆవుల భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆవుల భాస్కర్‌రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, కోచైర్మన్ భరత్‌రెడ్డి, సర్పంచ్ రమ, హెచ్‌ఎంలు వెంకట్రామిరెడ్డి, ప్రేమ్‌కుమార్, నాగరాజు, నరసింహారావు, రవి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిరకు చెందిన సంపసాల నరేష్(34) కొంతకాలం ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేశాక సొంతంగా మెడికల్ షాపు ఏర్పాటుచేసినా నష్టాలు రావటంతో మూసివేశాడు. ఈక్రమంలో దమ్మపేట మండలం రామచంద్రాపురానికి చెందిన మాధవిని కులాంతర వివాహం చేసుకోగా వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏడాదికాలంగా నరేష్ భార్యాపిల్లలతో అత్తగారింట్లో ఉంటూనే ఉద్యోగం కోసం ఆస్ట్రేలియా వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటీవల దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో ఈనెల 21న రామచంద్రాపురం నుంచి మధిరకు వచ్చిన నరేష్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, నరేష్ ఆత్మహత్యకు ముందు 'ఎదుటివారికి కష్టం వస్తే కులం లేదు, మతం లేదు. సృష్టి వినాశనం వచ్చినపుడు ఎవరు వచ్చారో నువ్వు ఆలోచించు. నీ ప్రాణం మీదకు వస్తేనే నీకు తెలుస్తుంది. మళ్లీ చెబుతున్నా నీ ప్రాణం మీదకు వస్తేనే నీకు తెలుస్తుంది. సర్వేజనా సుఖినోభవంతు.' అంటూ వాట్సాప్ స్టేటస్‌లో పెట్టినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో శనివారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఐదు కిలోల గంజాయి పట్టుబడింది. ఖమ్మం-1 ఎక్సైజ్ సీఐ కె.రాజు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లికి చెందిన మహ్మద్ రఫీ కల్వొడ్డు ప్రాంతంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులకు చెందిన షేక్ జాన్‌పాషా, శ్రీనగర్‌కాలనీకి చెందిన దోమకొండ జాన్, ఖమ్మం బల్లేపల్లికి చెందిన కాలెపోగు రాంబాబు, పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన వడిగారే సందీప్, ఎన్నెస్పీ రోడ్డుకు చెందిన గంటేల నరేశ్, రమణగుట్టకు చెందిన గొడ్డెండ్ల రంగయ్య అలియాస్ నాని ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఇతర రాష్ట్రాల్లో కేజీ రూ.3 వేలకు గంజాయి తీసుకొచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో 50 గ్రాములు, 100 గ్రాముల ప్యాకెట్లను రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. శనివారం ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్ సమీపంలోని ఎన్నెస్పీ బ్రిడ్జి వద్ద చేపట్టిన తనిఖీల్లో పట్టుబడగా ఐదు కిలోల గంజాయి లభించడంతో పాటు ఆటో, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు షేక్ రబ్బానీ, లత, ఉద్యోగులు రామారావు, శశికాంత్, రమేశ్, రవి, మారేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, లలిత, కవిత, శిరీష, రమ పాల్గొన్నారు.

త్వరలోనే నేలకొండపల్లి ఆస్పత్రి అప్‌గ్రేడ్!

నేలకొండపల్లి: నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు వైద్య విధాన పరిషత్ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక్కడి పీహెచ్‌సీని ఆరు పడకల నుంచి 30 పడకల ఆస్పత్రిగా మార్చారు. అలాగే, గత ఏడాది 2022 మార్చిలో వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేశారు. తాజాగా సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రికి తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, భవనాలు, ఖాళీ స్థల విస్తీర్ణం తదితర అంశాలపై ఉన్నతాధికారులు వివరాలు కోరినట్లు సమాచారం. దీంతో సీహెచ్‌సీ వైద్యులు కె.రాజేశ్ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు నివేదిక పంపారు. నేలకొండపల్లి సీహెచ్‌సీ 50 పడకలకు అప్‌గ్రేడ్ అయితే నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ మండలాలతో పాటు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది.

దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు చెరువు వద్ద కాపలాకు వెళ్లిన ఇద్దరిపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. బీరోలుకు చెందిన మత్స్యకారులు బయ్య మల్లయ్య, సోమలింగం మధ్య కొద్ది రోజులుగా చేపల విక్రయాల విషయంలో వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో సోమలింగం తరఫున పులుగుజ్జు నాగేశ్, రవి శుక్రవారం రాత్రి పెద్ద చెరువు వద్ద కాపలాకు వెళ్లగా, బయ్య మల్లయ్య, మహేశ్ మరో నలుగురు దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన నాగేశ్, రవి చేసిన ఫిర్యాదుతో శనివారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ప్రజల సమస్యలపై వెళ్తే ఎస్సై వెళ్లగొట్టారు..'

తిరుమలాయపాలెం: సర్పంచ్ భర్తగా ప్రజల సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే తనను బయటకు వెళ్లగొట్టిన ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కొక్కిరేణి సర్పంచ్ భర్త గంటా కృష్ణ కోరారు. ఓ మహిళకు సంబంధించిన కేసు విషయమై చర్చించేందుకు పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే ఎస్‌ఐ తనను అవమానించచారని తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ వరాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా కృష్ణ తరచుగా ఇతర కేసులకు సంబంధించి వస్తుండడంతో, ఆయనకు సంబంధించిన విషయమైతే రావాలని చెప్పి పంపించినట్లు వెల్లడించారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఓ గ్రామంలో ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిన వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో వీధుల వెంట తిరుగుతున్న ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లి సంపులో పడడంతో ఊపిరాడక మృతి చెందినట్లు సమాచారం. అయితే, ఈ ఘటనపై పూర్తి వివరాలు అందాల్సి ఉంది. పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో...

మధిర: అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ఆత్కూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోడ్డు జమలయ్య (32) కూలీ పనులకు వెళ్తుంటాడు. గ్రామంలోని తన బంధువుల ఇంటికి విద్యుత్ సరఫరా రాకపోవడంతో స్తంభం ఎక్కినట్లు తెలిసింది. ఆ సమయంలోనే షాక్‌కు గురై సిమెంట్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. దీంతో ఆయనను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జమలయ్యకు ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, ఆయన విద్యుదాఘాతంతో మృతి చెందాడా? తలకు అయిన గాయాలతో మృతి చెందాడా? అనేది తేలాల్సి ఉంది. ఈ ఘటనపై మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

దివ్యాంగుల పింఛన్ పెంచడంపై కృతజ్ఞతలు



కేసీఆర్‌తో ఎంపీ నామా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

ఖమ్మం మయూరిసెంటర్/సత్తుపల్లిరూరల్: ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. హైదరాబాద్ ప్రగతి భవన్‌లో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, బానోతు హరిప్రియ, కందాళ ఉపేందర్ తదితరులు కలిసి పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సమర్పించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే, దివ్యాంగుల ఫించన్‌ను రూ.4,016కు పెంచుతూ జీఓ జారీ చేయడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సబ్బండవర్గాల సంక్షేమం కోసం పథకాలు అమలుచేస్తూ దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వారు పేర్కొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దారి తప్పిన సీబీఐ దర్యాప్తు

వివేకా హత్యపై చార్జ్‌షీట్‌లో అభియోగాలన్నీ నిరాధారం

1,226 రోజుల దర్యాప్తులో సీబీఐ సాధించింది శూన్యం

దేశంలోనే ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'ద వైర్' విశ్లేషణ



సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు.. రాజకీయంగా అత్యంత సంచలనమైన కేసు.. దర్యాప్తు చేస్తోంది దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ. దర్యాప్తు చేపట్టిన 1,226 రోజుల తర్వాత కూడా సీబీఐ సాధించింది ఇదీ అని చెప్పడానికి ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. హత్య వెనుక విస్తృత కుట్ర ఉందనే మాట చెప్పడం తప్ప.. అందుకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన అభియోగాలకు ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఆధారాలు చూపించలేకపోయింది' అని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' పేర్కొంది. నిష్పాక్షికమైన థర్డ్ పార్టీగా 'ద వైర్' వెబ్‌సైట్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇటీవల దాఖలు చేసిన తుది చార్జ్‌షీట్‌లోని అంశాలను విశ్లేషించింది. రాజకీయ, నేర, న్యాయ సంబంధమైన వార్తా విశ్లేషకురాలిగా సుదీర్ఘ అనుభవం ఉన్న సరిత రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన విశ్లేషణాత్మక వ్యాసం ఇలా..

సాధించింది శూన్యం

2020 మార్చి 11న వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి బదిలీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే 120 రోజుల సమయం తీసుకుంది. మరో 474 రోజుల తర్వాత 2021 అక్టోబర్‌లో మొదటి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. వివేకా హత్యలో పాలుపంచుకున్నారని చెబుతూ ఎర్ర గంగిరెడ్డి(ఏ–1), సునీల్ యాదవ్(ఏ–2), గజ్జల ఉమాశంకర్ రెడ్డి(ఏ–3), దస్తగిరి(ఏ–4)లను నిందితులుగా పేర్కొంది. ఈ హత్య వెనుక విస్తృత కుట్రను వెలికి తీయాల్సి ఉందని చెప్పింది. సీబీఐ తుది చార్జ్‌షీట్ 2023 జూలై 20న బయటకు వచ్చింది. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వారి సన్నిహితుడు డి.శివశంకర్‌రెడ్డిలను కూడా నిందితులుగా పేర్కొంది. కానీ సీబీఐ మొదటి నుంచీ పేర్కొంటూ వచ్చిన విస్తృత కుట్ర గురించి మాత్రం ఏమీ చెప్పలేకపోయింది. హత్య వెనుక ఉద్దేశం అంటూ 14 పేరాల సుదీర్ఘ వ్యాసాన్ని చార్జ్‌షీట్‌లో పొందుపరిచింది. అందులో ఏముంది అంటే అందరికీ తెలిసిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ నేపథ్యం, వంశ చరిత్ర మాత్రమే. ఇది తప్ప వాస్తవానికి హత్య వెనుక విస్తృత కుట్ర గురించి సీబీఐ స్పష్టంగా ఏమీ చెప్పలేకపోయింది. ఇంతకీ ఇంతటి హైప్రొఫైల్ కేసుకు సంబంధించిన తుది చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు, వాటిలోని వాస్తవాలను పరిశీలిస్తే సీబీఐ దర్యాప్తులో డొల్లతనం బట్టబయలు అవుతోంది.

సీబీఐ తాను పేర్కొన్న అభియోగాలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క దానికి కూడా ఆధారం చూపించలేకపోయింది. అంతకు మించి వివేకా హత్య వెనుక ఆయన సొంత కుటుంబంలో విభేదాలు, బయట శక్తుల ప్రమేయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడం విస్మయ పరుస్తోంది. చార్జ్‌షీట్‌లో సీబీఐ ఏం చెప్పింది.. అందులోని వాస్తవం ఏమిటన్నది అంశాల వారీగా పరిశీలిస్తే ఈ కేసులో సీబీఐ ఇప్పటి వరకు సాధించింది శూన్యమన్నది స్పష్టమవుతోంది. సీబీఐ చెప్పిందేమిటి? వాస్తవం ఏమిటి? అన్నది చూద్దాం.

1.వివేకా క్రియాశీలకమైన నేత?

సీబీఐ: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత. రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు.

వాస్తవం: 2019 నాటికి వివేకా రాజకీయంగా ప్రభావవంతమైన నేత కాదు. హత్యకు గురయ్యే 15 ఏళ్ల ముందు 2004లో చివరిసారిగా ఎన్నికల్లో గెలిచారు. దశాబ్ద కాలంగా రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. 2008లో స్వదేశానికి తిరిగి వచ్చిన వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సోనియా గాంధీని కలిశారు. కానీ ఆయనకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం తిరస్కరించింది. వివేకా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారని ఆయన కుమార్తె సునీతనే సీబీఐకి రెండుసార్లు చెప్పారు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో వైఎస్ విజయమ్మపై పోటీ చేసి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన రాజకీయాల నుంచి రిటైరైపోయినట్టేనని ఆమె చెప్పారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా రాజీనామా చేసిన తర్వాత నుంచి ఆయన ఎలాంటి పదవిలో లేరు. పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మ చేతిలో భారీ తేడాతో ఓడిపోయాక కాంగ్రెస్ పార్టీ కూడా ఆయన్ను పట్టించుకోలేదు. ఎమ్మెల్సీగా కూడా నామినేట్ చేయలేదు. ఆయన అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం కూడా ఇందుకు కారణం అయిఉండొచ్చు.

2.అవినాశ్ బలమైన అభ్యర్థి కాదా?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వైఎస్ అవినాశ్ రెడ్డి బలహీనమైన అభ్యర్థి అని వివేకానందరెడ్డి భావించారని షర్మిల సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు.

వాస్తవం: అవినాశ్‌రెడ్డి బలహీనమైన అభ్యర్థి అన్నది పూర్తిగా అవాస్తవం. ఆయన అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో 1,90,323 ఓట్ల భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచారు. ఆయన ఎంత బలమైన అభ్యర్థో ఆ మెజార్టీనే చెబుతుంది. ప్రత్యేక హోదా సాధన డిమాండ్‌తో పార్టీ నిర్ణయం మేరకు తన ఎంపీ పదవికి 2018లో రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అవినాశ్‌రెడ్డి మరింత భారీ మెజార్టీతో అంటే 3,80,976 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డిపై అంత మెజార్టీ సాధించడం విశేషం. ఏ రకంగా చూసినా అవినాశ్‌రెడ్డి బలమైన అభ్యర్థి అన్నదాంట్లో సందేహం లేదు. వివేకానందరెడ్డి తాను హత్యకు గురికావడానికి ముందు వరకు కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేశారని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. వివేక హత్యకు గురైన ముందు రోజు రాత్రి కూడా అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం జమ్మలమడుగులో ప్రచారం చేశారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పినట్టు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డే ఎంపీ అభ్యర్థి అన్న విషయంలో మరో మాటే లేదని వివేకానందరెడ్డి సోదరి వైఎస్ విమల కూడా స్పష్టం చేశారు. ఎంపీగా అవినాశ్ గెలుపు కోసం వివేకా చివరి వరకు ప్రచారం చేశారని కూడా ఆమె చెప్పారు. ప్రస్తుతం కొందరు రాజకీయ దురుద్దేశంతో అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

3. షర్మిల వాంగ్మూలంలో చెప్పినదానికి ఆధారం ఎక్కడ?

సీబీఐ: 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా షర్మిల కానీ, విజయమ్మ కానీ పోటీ చేయాలని వివేకా భావించారనే విషయాన్ని షర్మిల వెల్లడించారు.

వాస్తవం: కడప ఎంపీ అభ్యర్థిత్వం విషయంపై వివేకానందరెడ్డి తనతో చెప్పినట్టుగా షర్మిల వెల్లడించిన సమాచారానికి ఎలాంటి ఆధారం లేదు. ఎంపీగా తానుగానీ తన తల్లి విజయమ్మగానీ పోటీ చేయాలని వివేకా చెప్పినట్టు వాంగ్మూలం ఇచ్చిన షర్మిల.. అందుకు ఎలాంటి ఆధారం చూపించలేకపోయారు. ఎంపీ టికెట్ అంశంపై వారిద్దరు మాట్లాడుకున్నట్టు కూడా గతంలో ఎప్పుడూ మీడియాలోగానీ పార్టీ వర్గాలుగానీ చెప్పలేదు. సీబీఐ ఎలాంటి ఆధారం గురించి పేర్కొన లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన రెండేళ్ల తర్వాత షర్మిల తన సోదరుడితో రాజకీయంగా విడిపోయి తెలంగాణలో సొంతంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ విషయం కూడా ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకున్నదే. ఒక వేళ కడప ఎంపీ అభ్యర్థి విషయంపై వివేకానందరెడ్డికి వేరే అభిప్రాయం ఉన్నా సరే రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపించదు. 2011లో పులివెందుల ఉప ఎన్నికల్లో విజయమ్మపై పోటీ చేసినప్పటి నుంచి వైఎస్సార్ కుటుంబ వ్యవహారాల్లో ఆయన పాత్ర పెద్దగా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ రాజకీయ నిర్ణయాల్లో కూడా ఆయన పాత్ర పెద్దగా ఏమీ లేదన్నది ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ తెలిసిన విషయమే. వివేకానందరెడ్డిపై సానుకూల దృక్పథంతో వైఎస్ జగన్ ఆయన్ను వైఎస్సార్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ చేశారు. కానీ వివేకా ఏనాడూ కూడా పార్టీ ముఖ్య నేతగా ఉండలేదు.

4. ఎమ్మెల్సీ ఎన్నికలపై సీబీఐ చెప్పింది కట్టుకథే

సీబీఐ: 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి కారణం. అవినాశ్‌రెడ్డి అనుచరుడు డి.శివశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావించినప్పటికీ వైఎస్ జగన్ తన చిన్నాన్న వివేకానందరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి పని చేశారు. దాంతో వివేకా ఆగ్రహంతో డి.శివశంకర్‌రెడ్డిని దూషించారు.

వాస్తవం: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివ శంకర్‌రెడ్డి కారణమనడానికి సీబీఐ ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. ఆ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 10 నియోజకవర్గాల పరిధిలోని 800 మందికిపైగా ఓటర్లలో ఎవర్ని ప్రలోభాలకు గురిచేశారో కూడా చెప్పలేకపోయింది. ఆ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో సీబీఐ కనీసం మాట్లాడనే లేదు. ఆ ఎన్నికల్లో వివేకా ఓటమికి, ఆయన హత్యకు సంబంధం ఉన్నట్టుగా కూడా సీబీఐ ఎలాంటి ఆధారాన్ని చూపించనే లేదు. రెండేళ్ల క్రితం నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విషయంపై తలెత్తిన వివాదం వల్ల తమను దూషించారనే ఉద్దేశంతో 2019 ఎన్నికల ముందు హత్యకు ఎవరైనా ప్రయత్నిస్తారా? అందులోనూ 2014 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అభ్యర్థి కుటుంబం 2019 ఎన్నికల ముందు హత్య వంటి దుందుడుకు పనులకు ఎందుకు ఒడిగడుతుంది? పైగా 2019 ఎన్నికల్లో 3.80 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచిన అవినాశ్ రెడ్డికి వివేకాతో రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉంటుంది? ఏమాత్రం ఉండదు. సీబీఐ తమ ఆరోపణకు ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది.

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో విభేదాలు

షమీమ్ అనే మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. వివేకా గుండెకు ఆపరేషన్ చేసుకున్నప్పటికీ ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ పులివెందులలో ఉండటం లేదు. హైదరాబాద్‌లో తన కుమార్తె సునీత నివాసంలో ఉంటున్నారు. నెలకు ఒకట్రెండుసార్లు పులివెందుల వచ్చి వెళుతున్నారు. కుమార్తె సునీత ఏడాదికి ఒకట్రెండుసార్లు మాత్రమే వస్తున్నారు. 'షమీమ్‌తో మా నాన్న సహజీవనం చేస్తున్నారని 2011లో బయటపడినప్పటి నుంచి ఆయనతో నేను సఖ్యతగా లేను. పులివెందులకు ఎప్పుడోగాని వెళ్లడం లేదు. 2018లో క్రిస్మస్ తర్వాత మళ్లీ నేను పులివెందుల వెళ్లనే లేదు. నా భర్త ఎన్.రాజశేఖరరెడ్డి మాత్రం అప్పుడప్పుడు వెళుతుండేవారు' అని సునీత చెప్పారు. వివేకానందరెడ్డి తన పేరును అక్బర్‌ఖాన్‌గా మార్చుకుని షమీమ్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నారు. షమీమ్ కుటుంబం నిర్వహణ బాధ్యత చూస్తుండటంతోపాటు ఆమె చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. బలపనూరులో ఆమె ఇంటి పై అంతస్తును నిర్మించడంతోపాటు 8 సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. ఇక వివేకానందరెడ్డి మొదటి భార్య సోదరులు తనను బెదిరించేవారని షమీమ్ సీబీఐకి చెప్పారు. పెద్ద భార్య పెద్ద సోదరుడు శివప్రకాశ్‌రెడ్డి తన ఇంటికి వచ్చి బెదిరించారని తెలిపారు. తన కుమారుడికి హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సీటు ఇప్పించడంతోపాటు అక్కడే ఓ ఇల్లు కొని ఇచ్చి.. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వివేకా షమీమ్‌కు మాట ఇచ్చారు. కానీ అంతలోనే వివేకా హత్యకు గురయ్యారు.

బయటి శక్తుల పాత్ర పట్టించుకోని సీబీఐ

వివేకా హత్య కేసు విషయంలో సీబీఐ దర్యాప్తు ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వనే లేదు. కుటుంబ విభేదాలు, రాజకీయంగా అడ్డుకునేందుకు యత్నించారంటూ సీబీఐ చెబుతున్న కారణాలేవీ కూడా నమ్మదగ్గవిగా లేవు. వాటికి ఎలాంటి ఆధారాలూ లేవు. అదే సమయంలో వివేకా కుటుంబంలో విభేదాలు, ఇతర అంశాలను కూడా లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి కుటుంబంలో విభేదాలు అనే అంశాన్నే సీబీఐ ప్రధానంగా ప్రస్తావిస్తుండటం కేవలం కేసును తప్పుదారి పట్టించేందుకేనని స్పష్టమవుతోంది. వివేకా హత్య వెనుక బయటి శక్తుల ప్రమేయంపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు. ఇప్పటి వరకు కేవలం సీబీఐ అప్రూవర్‌గా మార్చిన నిందితుడు దస్తగిరి, వాచ్‌మన్ రంగయ్య వాంగ్మూలాలనే ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేస్తోంది. కానీ వారు నిజాలే చెబుతున్నారనడానికి ఆధారం ఏమిటి?

అప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వివేకా

వివేకానందరెడ్డి షమీమ్‌ను రెండో వివాహం చేసుకోవడంతోపాటు ఆస్తి ఇస్తానని చెప్పడంతో మొదటి భార్య కుటుంబం ఆగ్రహించింది. కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకు చెక్ పవర్ రద్దు చేసింది.చెక్‌పవర్ రద్దు కావడంతో వివేకా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. మద్యం, ఇతర అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేక అల్లాడిపోయారని వివేకా ఇంట్లో పనివానిగా ఉన్న పెందింటి రాజశేఖర్ చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన సునీల్ యాదవ్, దస్తగిరిలతో సన్నిహితమయ్యారు. వారు చెప్పినట్టు చేస్తే వారిద్దరు డబ్బులు తెస్తారని ఎర్ర గంగిరెడ్డి వివేకాతో చెప్పేవారు. ఎనిమిది మంది నుంచి రూ.5 కోట్లు అప్పు తీసుకున్నారు. ఓసారి పెందింటి రాజశేఖర్ వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. తమ ఇంట్లో డబ్బు కోసం ఏదో గొడవ జరుగుతోంది.. వివేకానందరెడ్డి బాగా తాగేసి గొడవ చేస్తున్నారని చెప్పారు. 'మా నాన్న వివేకా ఇష్టానుసారంగా అప్పులు చేసి, తీర్చకపోవడంతో కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ట్రాక్ రికార్డ్ సరిగా లేకపోవడంతో కంపెనీలకు బ్యాంకులు అప్పులు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. కంపెనీల నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు అడ్డంకిగా ఉండకూడదనే మా నాన్న చెక్ పవర్‌ను రద్దు చేశాం' అని సునీత చెప్పారు. వాస్తవం ఏమిటంటే.. వివేకానందరెడ్డి హత్య తర్వాత ఆయన స్థానంలో సునీత ఆ కంపెనీల్లో డైరెక్టర్ అయ్యారు. జీవించి ఉండగా రోజువారి ఖర్చుల కోసం వివేకా ఇబ్బందులు పడ్డారు. కానీ ఆయన మరణించిన తర్వాత కొన్ని నెలలకే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆ కంపెనీ అప్పులన్నీ చాలా వరకు తీర్చేశారు. కంపెనీలన్నీ గాడిలో పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో 93 ఎకరాల భూమిని సౌభాగ్యమ్మ, సునీత పేరిట బదిలీ చేశారు.

జిల్లా వార్తలు

30 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మంమామిళ్లగూడెం/కొత్తగూడెంఅర్బన్: ట్రాక్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయగా, పనులు పూర్తికాకపోవడంతో మరి కొన్ని రోజులు రద్దు సమయాన్ని పొడిగించారు. తొలుత ఈ నెల 23 వరకు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, దానిని ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్–విజయవాడ (07755), విజయవాడ–డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్–విజయవాడ (07278), విజయవాడ–భద్రాచలంరోడ్ (07279) రైళ్లను ఈ నెల 30వ తేదీ వరకు రద్దు చేయగా, ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.అలాగే, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్డు స్టేషన్‌కు వచ్చే రైలును 30వ తేదీ వరకు, భద్రాచలం రోడ్డు నుంచి బల్లార్ష వెళ్లే రైలును 31వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


పీఓ ప్రతీక్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డీడబ్ల్యూఓ సబిత, సీడీపీఓలు

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో చిన్నారులు, గర్భిణులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చడం ద్వారా అంగన్‌వాడీలు ఆదర్శంగా నిలవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శనివారం ఆయన ఏజెన్సీ పరిధిలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్లలో తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని, తక్కువ బరువుతో జన్మించిన చిన్నారులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించాలని తెలిపారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువ గా ఉన్న వారి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఖాళీగా ఉన్న పోస్టులు, కేంద్రా ల్లోని అసౌకర్యాలపై నివేదిక అందించాలని డీడబ్ల్యూ ఓ సబితను పీఓ ఆదేశించారు. కాగా, పీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌కు తొలుత సీడీపీఓలు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సీడీపీఓలు ప్రమీల, సీతామహాలక్ష్మి, జ్యోతి, నవ్యశ్రీ, జ్యోతి, స్వర్ణలత లెనీనా, కనకదుర్గ, చైతన్య, లక్ష్మీప్రసన్న, మంగతాయారు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు జీవించే హక్కు లేదా?


టేకులపల్లిలో ర్యాలీగా వెళ్తున్న గిరిజనేతరులు


సభలో మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య, పక్కన నాయకులు

- చట్టాల్లోని వెసులుబాటు ప్రకారమే హక్కుల కోసం పోరాటం
- టేకులపల్లిలో గిరిజనేతరుల భారీ ర్యాలీ, సభ

టేకులపల్లి: ఏజెన్సీ చట్టాలతోపాటు ఆదివాసీ, గిరిజనులకు తాము వ్యతిరేకం కాదని.. ఏజెన్సీ చట్టాల్లోని వెసలుబాటు ప్రకారమే గిరిజనేతరులకు హక్కులు కోరుతున్నామని ఏజెన్సీ గిరిజనేతరుల హక్కుల సాధన సమితి నాయకులు వెల్లడించారు. శనివారం టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎస్సీ, బీసీ, ఓసీ, మైనార్టీలు గిరిజనేతరులు ఊరేగింపుగా తహసీల్‌కు చేరుకుని తహసీల్దార్ వీరభద్రంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన సభలో పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు పులిగిళ్ల మాధవ్‌రావు, ఇల్లెందు కన్వీనర్ జనగం కోటేశ్వర్‌రావు తదితరులు మాట్లాడారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే గిరిజనులతో కలిసి జీవిస్తున్నా తాము రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు కూడా పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులకు అనుమతి ఉన్నప్పటికీ గిరిజనేతరులు నోచుకోవడం లేదని వాపోయారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా, ఏ పార్టీకి అనుబంధంగా కాకుండా గిరిజనేతరులంతా కలిసి హక్కుల కోసం పాటు పడుతున్నామని అన్నారు. అయితే, కొందరు మాత్రం గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చు పెట్టాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని నాయకులు కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను పాలకులు, అధికారులు క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని గిరిజనేతరులకూ హక్కులు కల్పించాలని కోరారు. ఏజెన్సీలో గిరిజనులు, గిరిజనేతరులు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి జీవిస్తున్నా.. పాలకుల వైఫల్యంతో చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని చెప్పారు. ఇంకా ఈ సభలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నేత ఇస్లావత్ నామా నాయక్ పాల్గొని గిరిజనేతరుల హక్కుల సాధనకు మద్దతు ప్రకటించారు. ఏజెన్సీలోని మండల కేంద్రాల్లో పది కిలోమీటర్ల మేర రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని 2013 నుంచి ఉద్యమిస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నేతలు ధర్మపురి వీరబ్రహ్మాచారి, గుడిపూడి మోహన్‌రావుతో పాటు చిన రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఉదయ్, వెంకటేశ్వర్లు, హనీఫ్, వెంకన్న, రాములు, బిక్షమయ్య, ప్రసాద్, శంకర్, వసంతరావు, శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పై వీడిన సందిగ్ధం

- హైదరాబాద్ – కొత్తగూడెం జాతీయ రహదారిపై స్పష్టత
- నాలుగో ప్యాకేజీలో భూసేకరణకు సర్వే ప్రారంభం
- రోడ్డు నిర్మాణ మార్గంపై సర్వత్రా అసంతృప్తి


బొజ్జాయిగూడెం సమీపంలో సర్వే చేస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిలో చివరి ప్యాకేజీ ఏ మార్గంలో వెళుతుందోననే సందేహం ఇంతకాలం ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది. భూసేకరణకు సంబంధించి ప్రైవేటు ఏజెన్సీ శనివారం మండలంలో సర్వే ప్రారంభించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గౌరెల్లి, వలిగొండ, తిరుమలగిరి, తొర్రూరు, మహబూబాబాద్, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈ రహదారిని మొత్తం నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు మూడు ప్యాకేజీలకు సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక చివరి ప్యాకేజీని మహబూబాబాద్ జిల్లా బయ్యారం – భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలాల సరిహద్దు నుంచి ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి వెడల్పును 100 మీటర్లుగా నిర్ధారించి అందుకు అవసరమైన భూసేకరణ లక్ష్యంగా కసరత్తు ప్రారంభించారు. నాలుగో ప్యాకేజీలో భాగంగా రహదారి వెళ్లే మార్గాన్ని పరిశీలిస్తే.. ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్ అడవుల నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారి రాజీవనగర్‌తండా సమీపంలో మలుపు తీసుకొని కారేపల్లి మండలంలోకి ప్రవేశిస్తుంది. ఆ మండలంలో సుమారు పది కిలోమీటర్ల తరువాత లలితాపురం గ్రామం వద్ద తిరిగి ఇల్లెందు మండలంలోకి వస్తుంది. లలితాపురం వద్ద ఇల్లెందు – ఖమ్మం ప్రధాన రహదారిని దాటుకుంటూ.. మొట్లగూడెం వెలుపలి భాగం నుంచి మోద్దులగూడెం నుంచి ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారికి అనుసంధానం అవుతుంది. అయితే జాతీయ రహదారికి సంబంధించి ఇల్లెందు చుట్టూ ఏర్పాటు చేయనున్న బైపాస్ పూర్తిగా కారేపల్లి మండలంలో ఉండడంతో ఇల్లెందు పట్టణానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇల్లెందు – ఖమ్మం ప్రధాన రహదారి త్వరలో నిర్మించనున్న జాతీయ రహదారి నిబంధనలకు అనుగుణంగా 100 మీటర్ల వెడల్పుతో ఉన్నప్పటికీ ఆ మార్గాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే లలితాపురం చెరువు వెంట.. పంట చేల నుంచి మారుమూల గ్రామాల మీదుగా జాతీయ రహదారి నిర్మించేందుకు అధికారులు సర్వే చేస్తున్నారని, దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. జాతీయ రహదారి రూట్ మార్చితే ఇల్లెందుకు కొంతైనా ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

చింతకాని: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. చింతకాని మండలం వందనం గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు బాలనాగేందర్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం నిర్వహించగా కూనంనేని మాట్లాడారు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో పలు పార్టీలతో పొత్తులు అనివార్యమని.. అయితే, కమ్యూనిస్టులు సిద్ధాంతాలు మర్చిపోయారని ప్రచారం చేయటం సరికాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడే పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, నాగేందర్‌రెడ్డి పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేయడమే కాక అనేక ఉద్యమాల్లో పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. తొలుత బాల నాగేందర్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఎంపీపీ కోవూరి పూర్ణయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి రవీంద్రబాబు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, పోటు కళావతి, ఏపూరి లత, తాటి నిర్మల, సుజాత, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మంకెన రమేశ్, కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, శెట్టి మోహన్‌రావు, కన్నెబోయిన గోపి, కూరపాటి కిశోర్, కొప్పుల గోవిందరావు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ కొనసాగించాలి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నవోదయ విద్యాసంస్థల్లో ఇంటర్ చదివిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలల్లో నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. శనివారం ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశాక ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుండగా, రెండేళ్ల కిందటి వరకు నవోదయ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు వర్తింపజేశారని తెలిపారు. ఈ ఏడాది తొలగించడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశముందని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మొదటి విడత కౌన్సెలింగ్ లోపు నిర్ణయాన్ని వెలువరిస్తే మంచి కళాశాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు ధర్మవరపు యువరాజు, మధు, శివనాయక్, చందులాల్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరియర్స్, లాభాల్లో వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్‌కు సంబంధించి 24 మాసాల ఎరియర్లతో పాటు గత ఆర్థిక సంవత్సరం లాభాల్లో వాటాను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాలను ఏప్రిల్‌లో ప్రకటించి జూన్‌లో చెల్లించాల్సి ఉన్నా ఇప్పటికీ చెల్లించకపోవడం సరికాదన్నారు. లాభాల్లో వాటాతో పాటు 11వ వేజ్‌బోర్డ్ ఎరియర్స్‌ను త్వరగా చెల్లించాలని సూచించారు. కార్మికులు ఆరుగాలం కష్టపడి రూ.కోట్లలో లాభాలు సమకూరుస్తుండగా వారికి చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.నర్సింహారెడ్డి, ధర్మపురి, ఆల్బర్ట్, జాన్, భిక్షపతి, ఆర్.శ్రీనివాస్, ఐలయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.